ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

మంగళవారం 1 ఏప్రిల్ 2024 www.prajaaswaramdaily.com 4 pm

# భూముల విషయంలో జోక్యం చేసుకోండి



## మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను కలిసిన ఎంపీలు

ఢిల్లీ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కంచె గచ్చిబౌలి భూములపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణ బీజేపీ ఎంపీలు కలిశారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. పర్యావరణ, హెరిటేజ్ భూములను రక్షించాలని కోరారు. హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు కంచె [illegible] 700 రకాల ఔషధ మొక్కలు, 220 రకాల పక్షులతో ఆ ప్రాంతమంతా ఆర్త నాదాలో అల్లారుతోందన్నారు. ఈ భూములను రియల్ ఎస్టేట్ గా మార్చి వేల కోట్లు దండుకోవాలని ప్రభుత్వం చూస్తోందని బీజేపీ ఎంపీలు కేంద్ర మంత్రికి వివరించారు. హెచ్ సీయూ విద్యార్థులతోపాటు యావత్ హైదరాబాద్ ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని.. తక్షణమే గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ భేటీలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, నగేశ్ కూడా ఉన్నారు.



# హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

## విద్యార్థుల ఆందోళన

### మెయిన్ గేట్ వద్ద నిరసన
### లోపలికి వెళ్లేందుకు నేతల యత్నం
### పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషన్లకు తరలింపు



హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆ భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. మరోవైపు యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు.

# 400 ఎకరాలు.. ప్రభుత్వానిదే

### 19 ఏళ్లుగా వివాదాస్పదం
### అటవీ భూమిగా చిత్రీకరించి తప్పుదారి పట్టిస్తున్నారు
### జింక మరణంపై ఫేక్ పోస్టులు, తప్పుడు ప్రచారం
### కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు



ఢిల్లీ : హెచ్‌సీయూ 400 ఎకరాల భూముల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ప్రజలను గందర గోళానికి గురిచేస్తున్నాయని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూ వద్ద ఉన్న 400 ఎకరాల భూమి ప్రభుత్వ భూమి అని ఆయన అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఐఎంజీ భారత్ అనే సంస్థకు కేటాయించిన భూమిని వైఎస్ ఆర్ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య, కేసీఆర్ హయాంలో ఐఎంజీ సంస్థ వద్ద భూములున్నాయని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టులో పోరాడి ప్రభుత్వ భూమిని తిరిగి దక్కించుకున్నామని చెప్పారు. 19 ఏళ్లుగా భూమి వివాదంలో ఉంది కాబట్టి అక్కడ చెట్లు పెరిగాయని.. అటవీ భూములని తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పుకొచ్చారు. భూముల విషయంలో రాజకీయం చేస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం పార్లమెంటులో వక్ఫ్ బిల్లుని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధిని ఆపే ప్రయత్నం చేస్తున్నారని.. పర్యావరణ వేత్తలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. హెచ్‌సీయూ కేంద్రం చేతిలో ఉందని...బీజేపీ చెప్పినట్లు రిజిస్ట్రార్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 400 ఎకరాల భూమిని యూనివర్సిటీ భూమిగా చెబుతూ విద్యార్థులను రెచ్చ గొడుతున్నారన్నారు. జింక చనిపోయిందని ఫేక్ పోస్టులు పెట్టి, ట్వీట్లు డిలీట్ చేశారని ఎంపీ మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ అటవీ భూమిగా చిత్రీకరిస్తూ రాజకీయం చేస్తూ.. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

## బీఆర్ఎస్ నేతల ఇళ్ల వద్ద

# పోలీసుల మోహరింపు

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై వివాదం నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల నివాసాల వద్ద పోలీసులు మోహరించారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసాల వద్దకు పోలీసులు చేరుకున్నారు. మరోవైపు హెచ్‌సీయూ వద్ద ఆందోళనకు దిగిన బీజేవైఎం, సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. చికోటి ప్రవీణ్ సహా పలువురు నేతలను అరెస్ట్ చేసిన వివిధ పీఎస్‌లకు తరలించారు. హెచ్‌సీయూ వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

### హైకోర్టులో వట ఫౌండేషన్ పిల్..

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిల్ దాఖలైంది. జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలంటూ వట ఫౌండేషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. అత్యవసర విచారణకు స్వీకరించాలని ఫౌండేషన్ తరపు న్యాయవాది కోరారు. దీనిపై బుధవారం విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది.

## విదేశీ యువతిపై అత్యాచారం.. నిందితుడి వేటలో పోలీసులు

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మరో దారుణ సంఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. పహాడీ షరీఫ్ ప్రాంతంలో ఓ విదేశీ యువతిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారం చేసిన ఘటన కలకలం రేపుతోంది. ఈ ఘటనలో నిందితుడు క్యాబ్ డ్రైవర్‌గా పోలీసులు గుర్తించారు. సెలవుల కోసం ఇండియాకు వచ్చిన ఈ విదేశీ యువతి షాపింగ్ చేసేందుకు క్యాబ్ బుక్ చేసుకుంది. మీర్‌పేట్ పరిధిలోని ఫ్రెండ్ ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్న ఆమె, తన ఫ్రెండ్ అయిన మరో విదేశీ యువకుడు, పిల్లలతో కలిసి షాపింగ్ కోసం బయలుదేరింది. క్యాబ్‌లో గంటన్నర పాటు తిరిగిన తర్వాత, పహాడీ షరీఫ్ ప్రాంతానికి చేరుకోగానే క్యాబ్ డ్రైవర్ ఆ యువకుడిని, పిల్లలను కిందికి దించేశాడు. అయితే, యువతిని మాత్రం కారులో ముందుకు తీసుకెళ్లాడు.
కొంతదూరం తీసుకెళ్లిన తర్వాత, నిర్మానుష్య ప్రదేశంలో ఆ యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తిరిగి ఆమెను తీసుకువచ్చి, ఆమె స్నేహితుడి వద్ద వదిలేసి పరారయ్యాడు. బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా, అధికారులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనా స్థలానికి సమీపంలోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తూ, డ్రైవర్‌ను గుర్తించే పనిలో ఉన్నారు. ఈ ఘటన నగరంలో మహిళా భద్రతపై మరోసారి ఆందోళనలు రేకెత్తిస్తోంది.

## బాణసంచా పేలుడు..

# 13 మంది మృతి

### బనస్కంతా జిల్లాలో ప్రమాదం
### కూప్పకూలిన పైకప్పు
### శిథిలాల కింద చిక్కుకున్న పలువురు



గుజరాత్ : గుజరాత్ రాష్ట్రం బనస్కంతా జిల్లాలోని ఓ బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దీసా పారిశ్రామిక ప్రాంతంలోని ఓ కర్మాగారం లో మంగళవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పేలుడు ధాటికి ఫ్యాక్టరీ పైకప్పు కూలిపోయింది. దీంతో పలువురు కార్మికులు, వారి కుటుంబసభ్యులు కూడా చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలిస్తున్నారు. కొందరిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫ్యాక్టరీ యజమాని ప్రస్తుతం పరారీలో ఉన్నారని, అతడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.